Acc. No. 3278

ఆంధ్ర సంస్థానములు : సాహిత్యపోషణము

(సాహిత్య అకాడమీ బహుమతినందిన రచనము)

డా. తూమాటి దోణప్ప, ఎం.ఏ., పిఎచ్.డి.

బొబ్బిలి

ప్రవేశిక

తూర్పుకనుమల చాలులో, నాగావళీపరీవాహ సీమలో గజపతినగరము, చికాకోలు, చీపురుపల్లి, పార్వతీపురము, పాలకొండ, సాలూరు తాలూకాల మధ్య నేఁటి శ్రీకాకుళము మండలము నందు బొబ్బిలి జమీందారీ వ్యాపించి యుండినది. విశాఖపట్టణమునకు నైరృతిదిశలో డెబ్బదిమైళ్ళ దూరములో బొబ్బిలి పట్టణ మున్నది. బొబ్బిలి పట్టణ మీ సంస్థానమునకు రాజధాని. ఈ పట్టణమున్న స్థలమును చికాకోలు నవాబు షేర్ మొహమ్మద్ ఖాన్ చేత నీ సంస్థానపాలకులకు ప్రసాదింపఁబడుటవలన నచట కట్టిన కోటకు, పేటకు నివేశనదాత పేరు 'బెబ్బులి' పేర బెబ్బులి (షేర్ అనఁగా పెద్దపులి) యని వ్యవహరింపఁగా నదే జనులవాడుకలో 'బొబ్బిలి' యైనదఁట!* ధ్వనిపరిణామసూత్రములమేరకు బెబ్బులి, బొబ్బిలియగుననుట శాస్త్రవిరుద్ధము కాదు కాని, యీ వ్యుత్పత్తి చరిత్రగతి కనుగుణముగా నున్నదో లేదో చరిత్రకారు లింకను యోజించి చివరి మాటను చెప్పవలసియున్నది.

కావిటి, బొబ్బిలి, రాజాము, సీతానగరము అను నాలుగు తాణాలుగా నీ సంస్థానము పరిపాలనసౌలభ్యము నిమిత్తము విభజింపఁబడి యుండినది. ఒక్కొక్కతాణా ఒక్కొక్క అమీను నధికారముక్రింద పర్యవేక్షింపఁబడు చుండెడిది. ఈ సంస్థానము విస్తీర్ణము 920 చ.మై. 202 జిరాయితీ గ్రామములు, 70 అగ్రహారములు, 6 మొఖాసా గ్రామములు ఈ సంస్థానమున నుండినవి. ప్రాఁత జమీందారీ 300 చ.మైళ్ళ విస్తీర్ణమును, 139 జిరాయితీ గ్రామములును, 53 అగ్రహారములును, 5 మొఖాసా గ్రామములును కలిగియుండెడిది. జగ్గంపేట ఎస్టేటునుండి దొంతమూరు, రాయవరము భాగములు రావుబుచ్చివేంకటరావునకు వారసురాలయిన వెంగాయమ్మనుండి బొబ్బిలిరాజాగారిచే 1903, 1908లలో ఖరీదుచేయఁబడి 1916 లో నివి బొబ్బిలిరాజాగారి ద్వితీయపుత్రుఁడయిన రామకృష్ణరంగారావుబహద్దరునకు పీలుద్వారమున దఖలుపడి యుండినవి.

* 'షేరనఁ దురుష్కభాషను తెలుఁగున బులి
పెద్దపులి యను పదమయ్యె బెబ్బులియన
బెబ్బులియె నాఁడు నాఁటికి బొబ్బిలియనఁ
బొలిచె నక్షరములుమార్పుఁ బొంద నిపుడు'

—ప్రపదన పారిజాతము, అవతారిక, పు. 8.

రూ. 11,902 లు పేష్కషుగల కిర్లమపూఁడి ఎస్టేటుభాగములను రామకృష్ణ రంగారావుబహద్దరుగారు కొనుగోలుచేసియుండిరి. ఈ సంస్థానమునందు నాగావళి, వేగవతి, సువర్ణముఖి మొదలగునవి ముఖ్యనదులు. ఈ సంస్థానము నందలి అన్నమరాజుపేట, తుమ్మపాల మఱి యాఱు గ్రామములను విజయ నగరము జమీందారులకు కవులునకిఁబడుచువచ్చినవి. శాశ్వతకరనిర్ణయము నాఁటి దీని యుజ్జాయింపు ఆదాయము రూ. 1,28,240 లు. ఆ నాఁటి పేష్కషు రూ. 90,000 లు. 1938 నాఁటిలెక్కల ప్రకారము రాఁబడి ఆఱులక్షల యిరువది యాఱువేలకు పైఁబడి. పేష్కషు రూ. 83,442 లు. 'ఆర్బల్ నాట్' కంపెనీ వారి నీలిమందు కార్ఖానాలు పదునాలుగు ఈ జమీందారీలో నుండినవి.

సంస్థాన చరిత్రము

సంస్థానపాలకులు హరిపాదోద్భవులైన వెలమదొరలు. అత్యంత ప్రతాపాఢ్యులయిన ఈ దొరలలో రావువారు బలవంతులు. వీరిది రేచెర్లగోత్రము. ఇనుగంటి, చింతపట్ల, చెలికాని, తాండ్ర, దామెర గృహనామకు లగు వెలమ దొరలు బొబ్బిలి పాలకకుటుంబముతో నెయ్యము, వియ్యముకలవారు. వెంకట గిరివారికిని బొబ్బిలివారికిని మూలపురుషులొకరే. మూలపురుషుని నుండి పదు నైదవతరమువాఁడగు నిర్వాణ రాయప్పనాయఁడు నేఁటి కర్నూలు మండలము నందలి వెలుగోడును పాలించినవాఁడు. ఇతనికే పెద్దరాయఁడను వాడుక పేరుండెనఁట ; కొందఱు బొబ్బిలికి మూలపురుషుఁడు రాజాధర్మారావుగారని వ్రాసిరి. పెద్దరాయఁడు మూలపురుషుఁడని కార్మికేలు, హంటరు మొదలగు వారంగీకరించిరి. 'బొబ్బిలివారి వంశావళి'లో —

'అమ్మహావిష్ణుదయకుఁ బాత్రమ్ములగుచు
డెబ్బదేడు గోత్రమ్ముల తీవిమెఱయ
మానధనులయినట్టి పద్మజకులంబు
వారు వొలుతురు భువి వెల్మవారనంగ' —1—13

'అలడెబ్బదేడు గోత్రం
బులవారికి నాదిపీఠముగఁ బెక్కు తరం
బులనుండి గౌరవంబునఁ
బొలుతురు వేంకటగిరిప్రభువులు ప్రసిద్ధిన్' —1—14

'అలవేంకటగిరి పురరా
జులలోఁ బదునేనవ పురుషుండగుచు మహిన్
బొలిచెఁబెదరాయఁడాతఁడె
వెలసెను నిర్వాణరాయవిభుఁడను పేరన్' —1—19

పెద్దరాయఁడను నామాంతరముగల నిర్వాణ రాయప్పనాయఁడే మూల

పురుషుఁడుగా నిరూపింపఁబడినాఁడు.

ఈ రాయఁడప్పగారును, విజయనగరసంస్థానపాలకుల పూర్వులలో ఆనాఁటి పాలకుఁడును చికాకోలు నవాబు షేర్ మొహమ్మద్ ఖాన్ పదునేఁడవ శతాబ్ది మధ్యభాగము (క్రీ. శ. 1652) నందు మొగలుపాదుషా తరపున కళింగ సీమపై దాడి సాఁగించినపుడు ఖానుని వెంటవచ్చి తోడ్పడిరఁట! రాయఁడప్ప తోడ్పాటునకు సంతోషించి రాజాము ఎస్టేటును రాయఁడప్పకు మొగలుపాదుషా, షేర్ మొహమ్మద్ ఖాన్ ద్వారమున ప్రసాదించెనఁట! రాయఁడప్ప ఎస్టేటునందు కోటకట్టి దానికి తన ప్రభువు పేరుంచెనఁట. రాయఁడప్ప కుమారుఁడు లింగప్ప. బొబ్బిలికోటనిర్మాత లింగప్పయని కొందఱందురు. తండ్రికాలము నందే లింగప్పకు ఢంకా నగారా నౌబత్ శ్వేతచ్ఛత్రము రాజా బిరుదము మున్నగు రాజలాంఛనములు ప్రసాదింపఁబడియుండినవఁట.

లింగప్ప మొగలుపాదుషాలకు, చికాకోలు నవాబులకు తలలోని నాలుకగా ప్రవర్తించినవాఁడఁట! షేర్ మొహమ్మద్ ఖాన్ కుమారుఁడు వేఁట మార్గమున మారసీమల కరిగినపుడు పితూరీదారులెవ్వరో ఆతనిని బంధింపఁగా, ఖానుని అనుమతి మేరకు లింగప్ప సాహసించి మన్యపు ప్రాంతములన్నిటిని గాలించి, పితూరీదారులను చెఱపట్టి, ఖానునికొడుకును విడిపించి నవాబుమన్ననలను బడసెనఁట! దీనికిఁ బ్రతిఫలముగా లింగప్ప పండ్రెండు పోటుగ్రామములను నవాబునుండి బహుమతిగాఁ బొందెనఁట! ఈ సంఘటనము నేఁటి శ్రీకాకుళము మండలమునందలి పలాసాకు చేరువలోఁగల 'రంగవాక' యనుచోట జరిగిన దఁట. ఈ రంగవాక విజయమును పురస్కరించికొని నవాబు లింగప్పకు 'రంగరాయ' బిరుదమును బ్రసాదించెనఁట. లింగపరంగేంద్రుఁడు మహాయోధుఁడని సంకల్పసూర్యోదయావతారిక స్పష్టపఱుచుచున్నది. నాఁటినుండి లింగప్పరంగరాయల వంశీయులీ బిరుదమును పౌరుషచిహ్నముగా పరంపరగా తమ నామముల చివర ధరించుచు వచ్చిరి.

లింగప్పకు సంతతిలేనందున వెంకటగిరి ప్రభువులకోవలోని మాధవ రాయల మూఁడవ కుమారుఁడగు వెంగళరావుగారిని దత్తుతెచ్చిరి. పెద్దరాయఁడు గారిని కూడ లెక్కించినచో బొబ్బిలి పాలకులలో వీ వెంగళరావుగారు మూఁడవ వారు. పాలకజనకుఁడు మరణించునాఁటికి వెంగళరావు పిన్నవయసువాఁడు. అందువలనఁ గొంతకాలము తండ్రియగు మాధవరావును, వెంగళరావు పెద్దన్న పద్మారావును, మఱియొకయన్న నారప్పరావును సంస్థానవ్యవహారములను చక్కదిద్దిరి. వెంగళరావునకు రంగపతిరంగారావు, పెదజనార్దనరంగారావు అని యిరువురు కుమారులు. జనార్దనరంగారావుగారు లక్కవరపుకోటను సంపాదించి పాలించిరి. రంగపతిరంగారావుగారి కుమారులు రాజారాయఁడప్ప రంగారావుగారు. ఈయన తన తండ్రి మరణకాలమునాఁటికి చాలపసివాఁడు.

లక్కవరపుకోట పాలకుఁడును, ఇతని పినతండ్రి యగు రాజా పెదజనార్దన రంగారావుగారి కుమారుఁడును నగు రాజా వెంకటపతిరంగారావు కొంతకాలము ఎస్టేటువ్యవహారములను పర్యవేక్షించిరి. ఆ పిమ్మట రాయఁడప్పరంగారావుగారు స్వయముగా రాజ్యమును పాలించిరి. వీరికి సంతతిలేనందున రాజా గోపాలకృష్ణ రంగారావు బహద్దరుగారిని దత్తుతీసికొనిరి. ఈ గోపాలకృష్ణ రంగారావుగారు బొబ్బిలిపాలకుల పరంపరా సంబంధియగు రావు గోపాలరావుగారి పెద్ద కుమారుఁడు. గోపాలకృష్ణ రంగారావుగారి తమ్ముఁడు బొబ్బిలి ముట్టడిలోఁ బ్రసిద్ధుఁడయిన వెంగళ రంగారావుగారు. గోపాలకృష్ణ రంగారావుగారి భార్య మల్లమదేవి. ఈమె కసింకోటవాస్తవ్యులు, పద్మనాయక కులోత్తములు శ్రీ చెలికాని వెంకయాంబారామరాయల పుత్రిక. ఈమెసోదరియగు జగ్గమాంబ పిఠాపురము పెదనీలాద్రిరాయనింగారి (క్రీ.శ. 1730–1776) భార్య.

1756 లో చెలరేఁగిన ఉత్తరసర్కారులలోని జమీందారుల పితూరీల నణఁచుటకై గొప్పసేనతో తరలివచ్చిన ఫ్రెంచిసేనాని బుస్సీదొరగారికి విజయనగరము పెదవిజయరామరాజు (1717–1757) చాల తోడ్పడిరి. నిజాముసుండి ఫ్రెంచివారికి ఉత్తరసర్కారు లీఁబడినపుడు చికాకోలు, రాజమహేంద్రవరము సర్కారులను పెదవిజయరామరాజుగారికి కవులున కిచ్చుటకు బుస్సీదొరగా రామోదించియుండిరి. ఈ సీమయందలి పితూరీలకు మూలము బొబ్బిలిపాలకులని పెదవిజయరామరాజు బుస్సీదొరను నమ్మించి బొబ్బిలికోటను ముట్టడింపఁ జేసిరి. 1757 లో బొబ్బిలిముట్టడి జరిగి చరిత్రలో ప్రసిద్ధమయినది.

బొబ్బిలిరాణియగు మల్లమాంబ తన జోహారుకాలమున తన ముద్దుల తనయుఁడగు గోపాలవేంకటరంగారావు (1751–1801) ను వెంకటలక్ష్మి యను దాసిచేతికిచ్చి తన చెలియలగు జగ్గమాంబయొద్దకు సామర్లకోటకు పంపించినది. అప్పటి కింకను పెదనీలాద్రిరాయనింగారు పట్టమునకు రాలేదు*. రాజవంశీయుఁడయినను సంస్థానభాగస్వామికాక, సంస్థానపాలకునివలన వార్షిక భరణమును బొందుచున్న సామాన్యుఁడగు రాజబంధువుగా మాత్రమే యుండిన వాఁడు. బొబ్బిలిముట్టడితరువాత బుస్సీదొరగారు మరణించిన బొబ్బిలిరాజాగారి కుమారుఁడయిన గోపాలవేంకటరంగారావును పిలిపించి చిన్నరంగారావనుపేర బొబ్బిలికధిపతిగా నియమించిరి.

1766 లో విజయనగరసంస్థానము దివాను సీతారామరాజు ఈ గోపాల వేంకటరంగారావుగారిని మోసముతో బంధించితెచ్చి విజయనగరముకోటలో ఖైదుచేసి బొబ్బిలిని వశపఱచికొనెను. క్రీ.శ. 1766–1794 మధ్య బొబ్బిలి సంస్థానము విజయనగర సంస్థానములో నొకభాగముగా నుండినది. కాని

* ఈ నీలాద్రిరాయనింగారు క్రీ.శ. 1762–1776 మధ్య పిఠాపురమును పాలించినవారు.

1790 లో చినరంగారావు ఖైదునుండి తప్పించికొని సామర్లకోటకు పాటిపోయి పినతల్లి జగ్గమాంబ సంరక్షణమునఁ గొంతకాలము గడపి, ఆ పిమ్మట హైదరాబాదున కరిగి చాలకాల మచట వేచియుండి, నిజాముదయకు పాత్రుఁడయి తిరిగి వచ్చులోఁగా ఉత్తరసర్కారులు ఇంగ్లీషుకుంఫిణీపాలనక్రిందికి వచ్చి యుండినవి. 1794 లో నార్త్రనుడివిజను కలెక్టరుగారు నిజామునుండి సిఫార్సులు తెచ్చిన చినరంగారావును బిలిపించి పూర్వపు తాలూకాలను తిరిగి కవులున కిప్పించిరి. 1801 లో చినరంగారావు మరణించెను. ఈయనకు సంతతి లేనందున పాత్తేరులోని రావు సుబ్బమాంబా అన్నారావుగారల పుత్రుఁడగు చిన్నవాని నొకనిని దత్తు స్వీకరించిరఁట ; కాని చినరంగరాయల పరోక్షమున బొబ్బిలిరాజ్యమును శత్రురాజు లాక్రమింపఁగా రాయఁడప్పతండ్రియగు అన్నా రాయఁడు—

'రిపులం బాఱఁగఁ దోలి బొబ్బిలి ధరిత్రీనాథునిం గ్రమ్మఱన్
నృపతు ల్మెచ్చఁగఁ దత్పురిన్ నిలిపెఁ బెంపేపార మీ తండ్రి నే
రుపుతో వేంకటరంగభూవిభుఁ దపుత్రుండై హయస్యందన
ద్విపవిత్తాదులతోడ మీ కొసఁగె మైత్రిన్ రాజ్య మాత్మీయమున్'

అని సంకల్పసూర్యోదయ లిఖితప్రతులు సాక్ష్యమిచ్చుచున్నవి.

బొబ్బిలియాస్థానవిద్వాంసుఁడగు కొటికెలపూఁడి వేంకటకృష్ణసోమయాజి రాయఁడప్పరంగారాయల కంకితముగా రచించిన శ్వేతాచలమాహాత్మ్యము నందును ఈ యంశము ప్రసక్తమయినది. రావు కులీనుఁడగు అన్నారావు సోదరబంధుసహితుఁడయి—

'రంగరాయఁడు మున్నేలు రాజ్యమెల్ల
విక్రమాతిశయమున నాక్రమించి
సకల మానవనాథులు సన్నుతింప
తీర్థయాత్రకుఁ జనిన యాత్మీయవంశ్యుఁ
గ్రమ్మఱను దెచ్చి నిలిపెఁ దద్రాజ్యమునను'

అంతేకాదు. అన్నారాయల పుత్రుఁడగు రాయఁడప్ప చినరంగారావునకు దత్తుఁడయి బొబ్బిలి నేలినట్లును అందు వివృతము.

'శ్రీ రాయణప్పరంగ
క్ష్మారమణుం డేలుకొనును మహివేంకటరం
గారాయనికిం దత్తుం
డై రాజితకీర్తి ధవళితాంగుండగుచున్'

రాజా జనార్దనరంగారాయకృతమగు మిత్రవిందా పరిణయము నందును రాయఁడప్ప అన్నారాయ పుత్రుఁడుగానే ఉట్టంకింపఁబడినాఁడు. చినరంగరాయల దత్తుఁడను ప్రసంగమే కానరాదు.

ఈతఁడే రాజా రాయఁడప్పరంగారావు (1790—1830) అనుపేర బొబ్బిలిని 1802—1830 మధ్య పాలించిన ప్రభువు. బొబ్బిలిపట్టణములోని వేణుగోపాలస్వామి ఆలయమును కట్టించుటకు వీరే మొదలుపెట్టినవారు. వీరు కృతికర్తలుగను, కృతిభర్తలుగను పేర్వడసినవారు. రాజా రాయఁడప్పరంగారావు గారికి ఇద్దఱుభార్యలు. చెలికానివారి యాఁడుఁబడుచు చెల్లయ్యమ్మ మొదటి భార్య; ఇనుగంటివారి యాఁడుఁబడుచు బుచ్చయ్యమ్మ రెండవభార్య. చెల్లయ్యమ్మగారికి శ్వేతాచలపతిరంగారావు (1810—1862), జనార్దనరంగారావు, సీతారామచంద్రరంగారావు, వేంకటరంగారావు అను నలువురుపుత్రులును, అయిదుగురు పుత్రికలును, బుచ్చయ్యమ్మగారికి సీతయ్యమ్మ యను తనయయును జన్మించిరి.

రాజా శ్వేతాచలపతిరంగారావుబహద్దరుగారు 1830 లో పట్టమునకువచ్చి ముప్పదిరెండేండ్లు పాలించి 1862 లో పరమపదించిరి. తనతండ్రి రాయఁడప్ప రంగారావుగారు మొదలుపెట్టిన వేణుగోపాలస్వామి దేవాలయనిర్మాణమును 1837 లో వీరు పూర్తిచేసిరి. వీరు తొమ్మిదవతరమువారు. వీరు గోదావరి మండలములోని చింతపట్లవారి యాఁడుఁబడుచు వేంకటరమణమ్మ*ను, ఈమె మరణింపఁగా దామెరవారి కన్యయగు వెంగాయమ్మను వివాహమాడిరి. కాని, సంతతిలేనందున పిఠాపురముసంస్థానాధీశ్వరులు రాజా రావు వేంకటసూర్య రాయనింగారి (1844—1850) ద్వితీయపుత్రులగు సీతారామకృష్ణుల (1845—1868) ను దత్తు తీసికొనిరి. ఈయన రాజా సీతారామకృష్ణరాయఁడప్ప రంగారావుబహద్దరు అనుపేర బొబ్బిలిని 1863 నుండి అయిదేండ్లపాటు పాలించి 1868 లో పిన్నవయస్సుననే మరణించిరి. 1864 లో బొబ్బిలిలోని ఆంగ్లో వర్నాక్యులర్ పాఠశాలను వీరే స్థాపించినవారు. ఈయనభార్య ఇనుగంటి వారి యాఁడుఁబడుచు లక్ష్మీచెల్లయ్యమ్మ.

ఈ రాజదంపతులు నిస్సంతయినందున వేంకటగిరిసంస్థానపాలకులు శ్రీ సర్వజ్ఞకుమారయాచేంద్రుల (1832—1892) మూఁడవకుమారులగు రంగ మన్నారుకృష్ణయాచేంద్రుల (1862—1926) ను రాణీ లక్ష్మీచెల్లయ్యమ్మగారు 1872 లో దత్తుతెచ్చిరి. శ్రీ చెల్లయ్యమ్మగారు 1887 లో మరణించిరి. రంగమన్నారుకృష్ణయాచేంద్రులు వేంకటశ్వేతాచలపతిరంగారావు అనుపేర 1881 లో బొబ్బిలిజమీపాలనమును స్వీకరించిరి. బొబ్బిలిపాలకులలో పదు నొకొండవవారగు వీరు అతిప్రసిద్ధులు. ఇంగ్లీషుప్రభుత్వమువారినుండి వీరు

* 'ఆర్యులు నుతింపఁదనరు మదగ్రజన్ము
రాణి వేంకటరమణాంబ రమణుఁడలఁతు' —రాజా శ్వేతాచలపతిరంగారాయ బహద్దరు (1830—1862) గారి తమ్ములయిన జనార్దనరంగరాయల మిత్రవిందా పరిణయ కృత్యవతారిక.

మహారాజ, సర్ మొదలగు బిరుదములను సంపాదించిరి. 1893 లో యూరప్ ఖండమందు పర్యటించి విక్టోరియామహారాణిని దర్శించివచ్చిరి. నాలుగు పర్యాయములు మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిలులో సభ్యులుగా నుండిరి. వీరి పెద్ద కుమారులు రాజా వేంకటకుమారకృష్ణరంగారావు (1880—1920). వీరు 1917లో జమీకి వచ్చిరి. వీరి తరువాత రాజా సర్ శ్వేతాచలపతిరామకృష్ణరంగారావు బహద్దరు (1901—   ) వారు 1920 లో బొబ్బిలిపాలకులయిరి. వీరు జస్టిస్ పార్టీ నాయకులుగానుండి 1932—37 లో మద్రాసుముఖ్యమంత్రిగా పనిచేసి కె.సి.ఐ.ఇ. బిరుదమును పొందిరి. ప్రస్తుతము ఆంధ్రశాసనసభాసభ్యులు.

సాహిత్యపోషణము

బొబ్బిలిపాలకవంశమువారు ఇంచుమించుగా నేడవతరముపరకు సాహిత్యవ్యాసంగములయందు అంతగా కల్పించికొన్నట్లుగా నిదర్శనములు కానరావు. సంస్థానస్థాపకులగు రాజా నిర్వాణరాయఁడప్ప, రాజా లింగప్ప రంగారావుగారలు సంస్థాననిర్మాణమునందే సంలీనమై యుండినవారు. నిర్వాణ రాయప్పనాయఁడు 'సుకవిరాజమరున్మణి' (వెలుగోటివారి వంశావళి, 293) యనియు, అతని '....కొలువెల్లన్ గవిగాయకావళి....' (పైది, 189) తో విండియుండెడిదనియు, మల్లనకవినామకుఁడొకఁడు 'రాయప విజయ'మను కావ్యమును రచించెననియు (పైది, 218) వినుట తప్ప తక్కిన వివరములు మృగ్యములు. ఆ తరువాతి తరములవారికికూడ సంస్థానమును సుస్థిరము సేయుటయందో, విస్తరింపఁజేయుటయందో, శత్రురాజుల దాడుల నెదుర్కొనుట యందో సరిపోయినది. ఆఱవతరమువారయిన గోపాలకృష్ణ రంగారావుగారికి విజయనగరమువారి యెత్తులపై పైయెత్తులను వేయుటయందే గడచినది. వీరి కుమారులగు చినరంగారావుగారి జీవితకాల మేఁబదియేండ్లు. ఇంచుమించుగా పదియేండ్లు (1757—1766) ప్రవాసమునందును ముప్పదియేండ్లు (1766—1794) విజయనగరము ఖైదులోను వీరి బ్రదుకు చెల్లిపోయినది. 1794 లో రాజ్యము చేతికివచ్చిన కొలఁదికాలమునకే 1801 లో చిన్నరంగారావుగారు మరణించిరి. వీరి దత్తపుత్రుఁడుగా సంభావింపఁబడుచున్న రాజా శ్రీ రాయఁడప్ప రంగారావు గారితో నీ సంస్థానపాలకుల కృతిస్వీకారపూర్వక సాహిత్యపోషణమునకు 'నాంది' జరిగినది. కొట్ర, కొటికెలపూఁడి, మండపాక, మండలేముల, నుసర్లవంటి పండిత కవికుటుంబములు బొబ్బిలి పోషణమున వర్ధిల్లినవి.

కొట్ర బాలకవి

బొబ్బిలి సంస్థానము నాశ్రయించిన పూర్వకవులలో కొట్ర బాలకవి (1730—1790) యొకఁడు. ఈయన అసలుపేరు వేంకటేశ్వరకవి. తెలగాణ్య

శాఖకుఁ జెందిన వైదికులు. కౌశిక గోత్రులు. సోమనార్య పుత్రులు. బొబ్బిలివారి తాణాపట్టణమగు రాజామునకు చేరువనున్న 'ఇల్లంనాయఁడువలస' వీరి నివాస గ్రామము. ఇది కొత్రవారికి బొబ్బిలి సంస్థానాధీశ్వరు లగ్రహారముగఁ బ్రసాదించినది. కొత్రవారిది పండితవంశము. ఇతఁ డించుమించుగా అడిదము సూరకవికి సమకాలికుఁడు. 'కొత్రా బాలకవీందు శేఖరుఁడు మాకుం బూజ్యుఁ డెల్లప్పుడున్' అను అడిదము సూరకవి చాటువును బట్టి కొత్ర బాలకవి అడిదము సూరకవిచే స్తుతింపఁబడినట్లు తెలియుచున్నది.

'ఎదుని నొగలమీఁద హరియున్నచందాన
సూరకవిపరేణ్యు జోడుఁ గూడు
కొత్ర బాలకవి యకుంఠవాగ్ధాటికిఁ
బర్వతాలుగాఁడు పాఱిపోయె'

అనుచాటువునుబట్టి వీరిద్దఱు నాప్తమిత్రులని స్పష్టపడుచున్నది.

బాలకవి కొన్నిశతకములను, ప్రబంధములను రచించెననియు, వీనిలో ఖిల్లాణ చరిత్రమను ప్రబంధము ప్రశస్తకృతియనియుఁ జెప్పుచురుగాని అది లభ్యము కాలేదు. కొత్ర బాలకవి పేర 'విమలాంగీ పరిణయ' మను రెండాశ్వాసముల ప్రబంధము తాళపత్రప్రతి యొకటి చెన్నపురి ప్రాచ్య లిఖిత గ్రంథాలయమునఁ గలదు.[1] మాంధాతృ చక్రవర్తి కుంతల దేశాధీశుని కొమార్తెయగు విమలాంగిని వలచి పరిణయమాడిన కథ ప్రబంధ ఫక్కిలో నిందుఁ దీర్పఁబడినది. ఇది వేంకటేశ్వరాంకితము. లభ్యమైనప్రతి యసంపూర్ణము. నాయికా శీతలోపచారములు, జలక్రీడలవరకుఁ గలదు. ఇందలి దొకపద్యము :

'బొమ్మలు దీర్చినట్లొలయు బొమ్మల గ్రేవుల మూపు లంబుజా
తమ్ముల వీఁగ నొత్తు స్ఫురితమ్ములవేఁ దలమించు కన్ను లం
గమ్ము నిరాకరించు రుచిగ్రమ్మిన కమ్మని మేలు జూళువా
నమ్మకచెల్ల ! వీని నొబఁ గమ్మకరాంకున కైన నున్నదే'

రాయఁడప్పరంగారావుబహద్దరు

రాయఁడప్పరంగారావుగారు (1790—1830) కర్తయు, కారయితయు. వీరి రచనము సంకల్పసూర్యోదయమను కావ్యము.[2] తార్కికసింహ

[1] R. No. 564, మొదటి రెండాశ్వాసములు మాత్రమే కలవు,

[2] బొబ్బిలి పాలకవంశ వివరణమునెడల ముద్రితప్రతికిని, లిఖితప్రతులకును (ప్రాచ్య లిఖితగ్రంథాలయము R. No. 428 తాళపత్రప్రతి, R. No. 469 కాకితపు ప్రతి) అవతారికా ఉశ్వాసాంతగద్యముల పాఠభేదములుకలవు. బొబ్బిలి రాజాగారు (1881—1926) సవరణలతో ముద్రింపించుటయే దీనికి మూలకారణము.

వేంకటనాథవేదాంత దేశికాచార్యుల 'సంకల్పసూర్యోదయ' మను గీర్వాణ రూపకమునకిది పద్యరూపమగు తెలుఁగుసేఁత. వేదాంతదేశికుల సంకల్పసూర్యోదయము విశిష్టాద్వైతమతసిద్ధాంతసార సముద్బోధకము. ఇది పదియంకముల ప్రకరణమను రూపకము. ఇందు పంచవిధమయిన శారీరకశాస్త్రార్థము విశదీకరింపఁబడినది. దీనిని యథామూలముగా గద్యపద్యసమ్మిశ్రితముగా పదియాశ్వాసముల కృతిగా రాయఁడప్ప రంగారావుగా రాంధ్రీకరించి బొబ్బిలివారి కులదైవమగు శ్రీ వేణుగోపాలస్వామివారికి కృతిసమర్పణము గావించి ధన్యులయిరి. తాను నిఖిలశాస్త్ర వాసనాసముదిత విజ్ఞానము కలవాఁడనని కృతికర్త వివరించినాఁడు. గరిమెళ్ళ సుబ్బయ్యయను కవి యీ కృతినిర్మాణమునందు రాజావారికి తోడుగానుండెనఁట.

శ్రీవైష్ణవసంప్రదాయము మేరకు కావ్యావతారిక యందు ముకుంద స్తుతియు, తత్పరికరపరివారసంస్తుతియు, పన్నిద్దఱాళ్వారులు, దేశికులగు కందాళ వేంకటాచార్యులు, రాజపురోహితులగు కొటికెలపూఁడి వేంకటకృష్ణాహితాగ్ని మున్నగువారినిగూర్చి చేసిన స్తోత్రములును కలవు.

'సకలచమత్క్రియల్ దెలిసి శబ్దదరిద్రులుగాక కావ్య నా
టకరచనా బలాబల విడంబనముల్ గ్రహియించు సత్ప్రబం
ధ కవులతో వివాదపడినన్ బడవచ్చునుగాక సిగ్గుజెం
దక విహరించు దుష్కవివితానము చెంతకుఁ బోవవచ్చునే'

అని కుకవినింద చేయఁబడినది. శైలి దెలియుటకు మచ్చునకు రెండు పద్యములు :

'ఈ మునివాసమందుఁ బగలించుక యైనను లేవు తాపముల్
యామినులందు శీతభయ మారసి చూచిన లేదు, సింహముల్
సామజముల్ సఖిత్వమున సన్నుతి కెక్కె, శుకంబు లెల్ల వి
ద్యా మహిమన్ బఠించు నిగమాంతము భూరుహశాఖ లెక్కుచున్'.

—స్థానవిశేషసంగ్రహంబను షష్ఠాశ్వాసము, పు. 162.

'నిజమాయాతటినీనిమగ్నుఁడగు వానిన్ గ్రమ్మఱన్ వేడ్కతో
సుజనుల్ మెచ్చఁగ నుద్ధరించు కృప నక్షుద్రంబుగా వశ్యుఁడై
త్రిజగత్సన్నుతి నొప్పు విష్ణుఁడు ప్రపత్తిజ్యోత్స్న చేత న్విప
ద్వ్రజతాపంబు లణంచి తానొసఁగు నిర్వాణైకకల్యాణముల్'

—నిశ్శ్రేయసలాభంబను దశమాశ్వాసము, పు. 239.

రాజా శ్రీ రాయఁడప్పరంగారావుగారు సుప్రసిద్ధులగు విద్వాంసులను దేశదేశములనుండి రప్పించి వారికిఁ గుటుంబపారంపర్యముగ జీవనపర్యాప్తములగు ననేకాగ్రహారము లొసఁగి వేదవేదాంగములను నానావిధకళలను ప్రోత్సహించి పెంపొందింపఁజేసిరి. 'ఋగ్యజుస్సామ వేదశాఖ లెలమి

భూదేవతా కుమారులకుఁ దెల్పు వేదవేత్తల కెల్లను వివిధధనములిచ్చి పోషించిన' వారు రాయఁడప్ప రంగారావుగారు. దీనికి ప్రపదన పారిజాతము సాక్ష్యము.

'పురమున వేదశాస్త్రములఁ బూర్ణముగాఁగ నెఱింగినట్టి స
త్పురుషులనుంచి వారికిఁ బ్రభూతసుఖస్థితినిచ్చి వారిచే
నిరత మనేకవిద్యల ననేకులు నేరుచునట్టు లమ్మహీ
వరుఁడొనరించె విద్యలకు వాసముగాఁ బుర మొప్పునట్లుగన్'

—ప్రపదన పారిజాతము, అవతారిక, పు. 15.

కొటికెలపూఁడి వేంకటకృష్ణసోమయాజి

రాయఁడప్పరంగారావుగారి యాస్థానకవి కొటికెలపూఁడి వేంకటకృష్ణ సోమయాజి. ఈయన వెలనాటి బ్రాహ్మణుఁడు. ఆపస్తంబసూత్రుఁడు. హరితస గోత్రుఁడు. తాత శివరామయ్య, తండ్రి వేంకటరామయ్య. కొటికెలపూఁడివారు తరతరములుగ బొబ్బిలి వారికి హితులు, పురోహితులు. ఈ విషయము కూర్మ క్షేత్రమాహాత్మ్యమునుబట్టి నిరూపింపనగును.

'హితులు మదన్వవాయజుల కెల్ల పురోహితు లార్యలోకపా
లిత కవితాప్రకల్పిత దిలీపచరిత్రముఖోజ్జ్వలప్రబం
ధతతులు హౌరికాగ్రణు లుదారగుణాన్వితచిత్తు లస్మదా
శ్రితులు సమస్తసూరినుతశేముషులెన్నఁ దరంబె మిమ్ములన్'

అని కృతిపతి కృతికర్తను గూర్చి పలికినట్లు వ్రాయఁబడినది. వేంకటకృష్ణకవి తారకబ్రహ్మము, దిలీపచరిత్రము, ప్రబోధచంద్రోదయము, మేఘసందేశము, విజ్ఞానేశ్వరము, శ్వేతాచలమాహాత్మ్యమను పేరుగల కూర్మక్షేత్రమాహాత్మ్యము మున్నగు కావ్యములను రచించినవాఁడు. ఆశ్వాసత్రయ పరిమితమగు ప్రబోధ చంద్రోదయము కృష్ణమిశ్రుని గీర్వాణకృతి కాంధ్రీకృతి. మూఁడాశ్వాసములు గల కూర్మక్షేత్రమాహాత్మ్యము రాయఁడప్పరంగారావుగారికి కృతి; పద్మ పురాణస్థ భాగమునకిది యాంధ్రీకరణము. నాలుగాశ్వాసముల దిలీప చరిత్రము శ్రీరామాంకితము. తారకబ్రహ్మము రామ మహిమానువర్ణనము. మేఘ సందేశము కాళిదాసునకు తెలుఁగుసేఁత.

కూర్మక్షేత్రమాహాత్మ్యమునందలి యొకమాదిరి పద్యము :

'ఆ మాటల్ విని భూవిభుండు నిజభార్యన్ సద్వ్రితాసక్తికిన్
శ్రీమన్మాధవభక్తికిన్ బొగడి ధాత్రిన్ మూఢచిత్తుండనై
భామారత్నము పాటి బుద్ధి గణుతింపం బూనఁగాలేక యా
సోమార్కంబు ఒపకీర్తిపాలయితి నంచున్ లోనఁ బింతిల్లుచున్'

వేంకటకృష్ణసోమయాజి కృత్యంతరమగు విజ్ఞానేశ్వరీయము (వ్యవహార కాండము) ఇనుగంటి సీతారామరాయ ప్రేరణమున విరచితము. ఆచార

ప్రాయశ్చిత్త వ్యవహారములను మూఁడు కాండములుగల యాజ్ఞవల్క్యస్మృతి ప్రాచీనధర్మశాస్త్రము. దీనికి విజ్ఞానేశ్వరుఁడు మితాక్షర యను పేర రచించిన వ్యాఖ్యానమునకు పండితలోకమున విజ్ఞానేశ్వరీయమని ప్రసిద్ధి కలదు. మూలమునకు కాక దీనికి వ్యాఖ్యగా విజ్ఞానేశ్వరీయమును పేర నాంధ్రీకరించినాఁడు. బొబ్బిలి పాలకులు రాజా రాయఁడప్ప రంగారాయ నిరాటంకముగను ఖానుపఁడును, ప్రధాన మంత్రియును. ఆ కాలపు సల్లాపుఁడును గుణ సీతారామ ప్రభుమౌళి '...యాజ్ఞవల్క్య రచిత స్మృతిమాంధ్రీకరింపు'మని కోరఁగా, అయిదాశ్వాసముల గ్రంథముగా దీని రచించినాఁడు.*

కొటికెలపూఁడి కోదండరాముఁడు

కోదండరామకవి వెంకటసోమయాజి నింగయామాత్య పుత్రుఁడు. ఆత్రేయగోత్రుఁడు. ఆంధ్రగీర్వాణ నావ్యుత్పన్నుఁడు. నానా వేదాంతపారీణుఁడు. జ్యోతిషాయుర్వేద విద్యా విశారదుఁడు. సిద్ధాంతిగ సుప్రసిద్ధుఁడు. ఉభయ కవిత్వరచనాకల్పనాచతురీధురీణుఁడు. శ్వేతాచలాధీశ ఘనసభ నందు విశేష భూషితుఁడు. ప్రపన్నపారిజాత ప్రబంధ నిర్మాణ నిపుణుఁడు.

'అభ్యసించితివి శాస్త్రం బాదు సూరిత నలువేదాంతశాస్త్ర చయమును'
ప్రపన్నపారిజాత అవతారిక. ప. 6.

అని కృతిపతి రాజా శ్వేతాచలపతి రంగారాయబహద్దరు (1810–1862) కృతికర్తతో పలికిన పలుకులను బట్టి పైవిషయము సహేతుకముగ స్పష్టముగు చున్నది. నృసింహపురాణ తారకబ్రహ్మమాహాత్మ్య ప్రమాణ సంగ్రహమును, జానకీరామ జానకీవల్లభ వేదచూడామణి భావిపూజ మారుతి రామశతంబు రామప్రభు వేణుగోపాల శ్రీసత్యాద్యష్టక శతకములును సిద్ధాంతగణిత శాస్త్ర గ్రంథములును కోదండరామకవి కృత్యంతరములు. ఇసుగంటి సీతారామచంద్ర ప్రభువర్యుఁడు కృతిభర్తయగు శ్వేతాచలపతి రంగారావుగారికి మేనత్తమగఁడు. ఆయన పూర్వాచార్య ప్రోక్తమయిన ప్రపదనము నుద్ధరించి కృతిభర్తను సాకల్యముగా సద్గాని నుపదేశించియుండెనఁట। ఆ ప్రపత్తి రీతి నాంధ్రకృతిగాఁ జేయింపుమని భగవద్రామానుజులు స్వప్నమున సాక్షాత్కరించి కృతిభర్తను బ్రబోధింపఁగా నాయన కోదండరామకవిని పిలిపించి యీ కృతిని నిర్మింపఁజేసెనఁట. విశిష్టాద్వైత సిద్ధాంతమునను బ్రధానములగు ద్వయ మంత్ర తిరుమంత్రార్థములను భక్తిప్రపత్తుల స్వరూపమును మఱియు నత్యంతావశ్యకములగు నాధ్యాత్మికాంశములను గొన్నింటిని ముముక్షుజనోపయోగముగా నిరూపించు అయిదాశ్వాసముల దివ్యప్రబంధము ప్రపదన పారిజాతము. కృతి భర్త 'వేదశాస్త్రపురాణ విద్యలందధికులై బ్రహ్మవాదము సేయు బ్రాహ్మణులును,

* R. No. 593 ప్రాచ్యలిఖిత గ్రంథాలయ ప్రతి.

మండితాన్వీక్షకీ దండనీతిత్రయీవార్తాఖ్యలగు సచివప్రజంబు....' (ప్రపదన. పు. 4) నిరంతరము బలసికొలువ గోష్ఠినుండెడు వాఁడఁట. కృతిభర్త పౌత్రులగు మహారాజా శ్రీ రావు సర్ వేంకటశ్వేతాచలపతిరంగారావు బహద్దరువారి సమాదరణమున నీ ప్రపదనపారిజాత కృతి ప్రకాశితము. మచ్చునకు ఒండు రెండు పద్యములు :

'పచ్చనివాఁడు, విష్ణుపదభక్తి వెలింగెడువాఁడు, వాణిపై
మచ్చటగల్గువాఁడు, నలుమోములవాఁడు, త్రయీపురాణముల్
మెచ్చినవాఁడు, లోకముల లీల సృజించినవాఁడు, పాపముల్
త్రచ్చినవాఁడు, తద్భువనపల్లభుఁడైన విధాత ప్రీతితోన్'

—ప్రథమ. పు. 24.

'హరికిన్ జీవులు శేషభూతులు, సమస్తాత్మాళికిన్ శేషి శ్రీ
హరియే కాని యొరుండుకాఁడని యుకారార్థంబు లక్ష్మీపతీ
తర శేషిత్వగత భ్రమాత్మకమతిన్ దామిశ్రమున్ బాలభా
స్కరుఁడు మాడ్కిన్ నిమిషంబు లోపలఁ దొలంగంజేయు దాసాళికిన్'

—ద్వితీయ. పు. 57.

'సూత్రపతీశు వంపున విశుద్ధచరిత్రులు హేమరత్న స
ద్వేత్రధరుల్ మహోజ్జ్వలులు విష్ణుభటుల్ చనుదెంచి యాతనిన్
స్తోత్రములాచరించుచును దూర్యరవంబులతో ధ్వజాళితో
పాత్రల యాటతోడ హరి పాలికి పేఁగొని పోయి యచ్చటన్'

—పంచమ. పు. 132.

ఇఁక కవి కృత్యంతరముల నవలోకింతము. ఆరా శ్వాసములుగల నృసింహపురాణము గీర్వాణకృతి కాంధ్రీకరణము. 'శ్రీరమ్యంబగు బొబ్బిలీ పురమునన్ శ్వేతాచలాధీశ రంగారాయాగ్రణి గొల్వఁ బార్శ్వములవేడ్కన్ రుక్మిణీ సత్యభామారత్నంబులు నిల్వ భక్తజనులన్ బాలించు గోపాలకా ధీరగ్రామణి'కిది యంకితము. బ్రహ్మాండపురాణ మంత్రఖండస్థిత తారకబ్రహ్మ మాహాత్మ్యమునకుఁ దెలుఁగుసేఁత పంచాశ్వాస పరిమితమగు తారకబ్రహ్మ మాహాత్మ్యము. విష్ణుపు దశరథనందనుఁడయి జన్మించి శంబరుఁడను రాక్షసుని సంహరించిన కథ యిందలి ప్రధానేతివృత్తము.

'జానకీరామ దేవతాసార్వభౌమ' యను మకుటముతోడి 303 సీసపద్యముల జానకీరామ శతకమును, 'శ్రీ జానకీవల్లభా' యను మకుటముగల శార్దూల మత్తేభ వృత్త సంభరితమగు జానకీవల్లభ శతకమును,' రామా దేవచూడామణీ' యను మకుటముగల దేవచూడామణి శతకమును, భారతీ యను మకుటముతో నొప్పు భారతీస్తవరూపమగు భారతీ శతకమును, మాధవా మకుటభూషితమును విష్ణు స్తుతిపరమును నగు మాధవశతకమును, మారుతీ యను మకుటముగల

మారుతిశతకమును, రామ రాజవతంసా యను మకుటముగలిగి శ్రీరామస్తుత్యాత్మకమగు రాజవతంస శతకమును, 'శ్రీ వేణుగోపాలకా' యను మకుటముతో వేణుగోపాలాంకితమగు వేణుగోపాల శతకమును, లక్ష్మీ స్తుతిరూపమగు శ్రీసతి శతకమును కోదండరామకవి కూర్చిన శతకసంచయమున ప్రశస్తరచనములు.

ఆర్యభటీయ గణితమందలి పట్టీకార గణితరీతిని దెలుపు నార్యాసూత్ర ద్వితయమునకు వ్యావహారికాంధ్రమున సంధానించిన వ్యాఖ్యానము సుధా తరంగము. రచనాకాలము శా. శ. 1766 (క్రీ. శ. 1844).

శతకములనుండి మాదిరికి కొన్ని పద్యములు :

'శ్రీ రంజిల్లు మొగంబుతోఁ గటకకాంచీహారకోటీర మం
జీరోదార విభూషణవ్రజముతో శీతాంశు తుల్యాభతోఁ
గారుణ్యామృతపూర పూరిత కటాక్షశ్రీలతో భూరిశృం
గారాకారముతోడ వచ్చినను వేడ్కం బ్రోవుమీ భారతీ'

—భారతీ శతకము.

'కంజాప్తాన్వయ దుగ్ధవారినిధి రాకాచంద్రు సద్వాక్యముల్
కంజాక్షీమణియైన సీతకును దత్కాంతామతల్లీ వచః
పుంజంబుల్ రఘుభర్తకున్ దెలుపుచున్ బుత్రాకృతిన్ వారిచెం
తం జెల్వారఁ జరించి మించిన నినున్ ధ్యానించెదన్ మారుతీ'

—మారుతి శతకము.

'శ్రీ సీతాకరపద్మసేవితములై సింధూరశోణంబులై
ప్రాసాదధ్వజ శంఖచక్ర భిదురాబ్జచ్ఛత్ర చాపాదిరు
గ్వ్యాసక్తాంకములై మునీశ్వర మనోగమ్యంబులై భక్తసం
త్రాసంబుల్ తొలఁగించు త్వచ్చరణముల్ ధ్యానింతు రామప్రభూ'

—రామప్రభు శతకము.

'సిరులం మాఁగెడు బొబ్బిలీపురమునన్ శ్వేతాచలాధీశభూ
వరుఁ డర్పింపఁగ హేమరత్నమయ భాస్వద్దివ్యగేహంబునన్
సరిగాఁ బార్శ్వములన్ విదర్భతనయా సాత్రాజితుల్ గొల్వ సు
స్థిరతన్ నిల్చిననీకు మ్రొక్కెదనుమీ శ్రీ వేణుగోపాలకా'

—వేణుగోపాల శతకము.

జనార్దన రంగారాయబహద్దరు

ప్రపదనపారిజాత కృతిపతియగు శ్వేతాచలపతి రంగారాయబహద్దరుగారి సోదరులగు రాజా జనార్దనరంగారావుగారు మృదుమధురోభయకవితావైచిత్రి గల విద్వత్కవులు. పోషితసత్కవినికాయ బిరుదలాంఛనులు. హరిభక్తి సుధోదయమను తాత్త్విక ప్రబంధమును, మిత్రవిందాపరిణయమను శృంగార

ప్రబంధమును జనార్దనరంగారావుగారి ప్రతిభాపాండిత్యములకు నికషోపలముల వంటివి. హరిభక్తిసుధోదయము శ్రీమన్నారదీయమునందలి హరిభక్తి సుధోదయమున కాంధ్రానువాదము. మూలగ్రంథము ఇరువది యధ్యాయములలోఁ గలదు. నాలుగాశ్వాసములు గల మిత్రవిందా పరిణయము శ్రీకృష్ణలీలావిలాస ప్రదర్శకమగు శృంగారప్రబంధము. శ్రీకృష్ణుఁడు మిత్రవిందను బరిణయ మాడుట యిందలి యితివృత్తము. ప్రాచీనధోరణిలో ప్రబంధపక్కిలో సంత రింపఁ బడిన ఈ కృతి శ్రీరామచంద్రమూర్తి కంకితము. 'ఆంధ్రభాషా విలాసిని' యను మాసపత్రికయందు తొలుత వెలువడుచుండి ఆ పిమ్మట చిత్రాడ శ్రీరామవిలాసగ్రంథమాలా కుసుమముగాఁ బ్రచురిత మయినది.[1]

'భవ్యగుణజాల వేణుగోపాలబాల' యను మకుటముతో 'సిరుల వెలుంగు బొబ్బిలిపుర వరమునఁబరగు శ్వేతాచలపతి నరవర మందిరోత్తర భాగమందుఁ జెన్నొందు....మంగళ తరాలయమున రుక్మిణీ సత్యభామాది మదవతులు గొలువ....' వెలసిన వేణుగోపాలుని పేర వెలసిన నూఱు సీసపద్యముల వేణుగోపాల శతకము జనార్దన రంగారాయల కృత్యంతరము.[2]

మండపాక కవులు

బొబ్బిలి సంస్థానము నాశ్రయించిన కుటుంబములలో మండపాకవారి వంశము సుప్రసిద్ధము. మండపాక పేరయకవి, మండపాక కామకవి, మండ పాక పార్వతీశ్వరశాస్త్రి, మండపాక ఇమ్మడి కామకవి మొదలగు వారు బొబ్బిలి సంస్థాన కవులలో ముఖ్యులు. మండపాకవారు వేగినాటి వైదికులు, పారాశర గోత్రజులు. వీరి పూర్వులు విజయనగరము పెద విజయరామగజపతి (1710—1757) వలనను సమ్మానితులఁట! వీరిలోనొకఁడు మండపాక లచ్చన్న; లచ్చన్న కుమారుఁడు పేరయ్య. పేరయ్య కుమారుఁడు కామకవి. బొబ్బిలి సమీపమునఁగల కామనవలస యగ్రహారము వీరి నివాసము. ఈ యగ్రహారము పూర్వ ప్రభువులు ప్రసాదించినదఁట! పేరయకవి నిరోష్ఠ్య దాశరథీ శతకము, కుముద్వతీ పరిణయము, ఇందుమతీ పరిణయము మున్నగు గ్రంథములను రచించి యుండిరఁట! బొబ్బిలిలో మండపాకవారి యిల్లు పరశురామప్రీతియైన తటి నీ కృతులన్నియు బూడిదయైనట్లు చెప్పుచున్నారు. అయినను ఆ యా గ్రంథముల లోనివని స్మృతిలోనున్న కొన్ని పద్యములను మాత్రము మండపాక వంశీయులు సేకరించియున్నట్లు తెలియుచున్నది. 'శ్రీసీఁబ నుభయభాషామిశ్ర సంస్కృతుల్ తద్జ్ఞు లెన్న మదంకితములు సేసి యశము గాంచిన పేరయ మనీషిమణి....' (రాధాకృష్ణసంవాదము, 1—29) అని పేరయకవి పౌత్రుఁడగు

1 కాకితపు ప్రతి, R. No. 461 (a) ప్రాచ్యలిఖిత గ్రంథాలయము.

2 తాళపత్ర ప్రతి, R. No. 433 ప్రాచ్యలిఖిత గ్రంథాలయము.

పార్వతీశ్వరకవిని శ్రీకృష్ణుఁడు సంబోధించినట్లున్న పద్యమునుబట్టి పేరయ్య కవి సత్కృతులు కొన్ని రచించినట్లు భావింపవచ్చు.

మండపాక కామకవి

మండపాక కామకవి (1810—1872) పితృపాదుల సన్నిధిని కావ్యపంచకము పూర్తిచేసి అలంకార శాస్త్రము నభ్యసించి సాహిత్యవిద్యలో నాఱితేరినవాఁడయి పెక్కు గ్రంథములను రచియించెనఁట! వానిలో కార్తీకవ్రతమాహాత్మ్యము, బలరామక్షేత్రమాహాత్మ్యము, బ్రహ్మోత్తరఖండము, జానకీరామ రామచంద్రప్రభు శ్రీసూర్యనారాయణ శతకములును, కొన్ని అష్టకములు, దండకములును పేర్కొనఁదగినవి. ఈయన కృతులలో బలరామక్షేత్రమాహాత్మ్యము ప్రధానమైనది. కృష్ణాగ్రజుఁడగు బలరామునిచే వరాహవర్తినీవిషయమున ప్రతిష్ఠితములయిన అయిదు శైవక్షేత్రములకథ స్థలపురాణముగా అయిదాశ్వాసములలో సంధానింపఁబడిన కావ్యమిది. కామకవి శిష్యుఁడును, సహస్ర కంధరరామాయణకర్తయును నగు ముద్దు లక్ష్మీనారాయణ కవి తనగురువు సాహితీవిభవదీపితుఁడనియు, సత్కవితాధురంధరుఁడనియు పరికీర్తనము సేసినాఁడు.

మండపాక పార్వతీశ్వరశాస్త్రి

మండపాక కామకవిగారికి రామస్వామిశాస్త్రి, పార్వతీశ్వరశాస్త్రి, పేరయశాస్త్రి అని మువ్వురుకుమారులు. అవధూతానుభూతి, గీతాశాస్త్రము, వేదాంతకృతికదంబము మున్నగునవి రామస్వామిశాస్త్రి (1831—1888) రచనలు. చిట్టచివరివాఁడగు పేరయశాస్త్రి మంత్రశాస్త్రవేత్తయఁట! ద్వితీయుఁడగు పార్వతీశ్వరశాస్త్రి (1833—1897) బొబ్బిలిసంస్థానాస్థానకవి. శ్వేతాచలపతిరంగారావుగారి కాశ్రితుఁడు. ఈయన శతాధిక గ్రంథకర్త. బ్రహ్మేశ వేంకటశైలనాయక చంద్రఖండకలాప సూర్యనారాయణ మొదలయిన పదునైదు ఏకప్రాస శతకములు; కాశికావిశ్వనాథ జగన్నాయక వరాహనృసింహ హరిహరేశ్వర— మున్నగు పాతిక చిత్రకవిత్వ శతకములు; ఉమాసంహిత, అమరుకము, కాంచీపురమాహాత్మ్యము మున్నగు నాంధ్రీకృతులును, జగదీశ వేణుగోపాల—మొదలయిన నక్షత్రమాలికలు; జగదీశతారావళి మొదలయిన తారావళులు; వర్ణనమాలికలు, స్తుతికదంబములు, కీర్తనలు, కృతులు, పదములు, జావళులు, చిత్రకథలు, యాత్రాచరిత్రలు, ఉపన్యాసములు, సహస్రాధికములగు చాటువులును; కవితావినోదకోశ కాశీశ్వరాష్టకాది గీర్వాణకృతులును వీరి గంటమునుండి వెలువడినవి. వీరిరచనలన్నింటికంటె శ్రీకృష్ణాభ్యుదయ రాధాకృష్ణసంవాద ప్రబంధములు మేల్తరములయిన రచనలు. రాధాకృష్ణసంవాదము వేంకటగిరిప్రభువు రాజ

గోపాలకృష్ణయాచేంద్రుల (1878–1916) పట్టాభిషేకోత్సవచరితము. రాధాకృష్ణుల సంవాదరూపమున చమత్కారాపాదకముగా సకలకవితావినోదకోశ మాలికగా సంధానింపఁబడినవి. కవికర్ణరసాయనమగు కావ్యము. శ్రీకృష్ణాభ్యుదయ మేకాశ్వాసప్రబంధము. శ్రీకృష్ణకథలోని ముఖ్యఘట్టము లిందు సంక్షేప రూపమున నిరూపితము. పార్వతీశ్వరశాస్త్రిగారు వ్రాసిన ప్రబంధసంబంధబంధ నిబంధనగ్రంథము చిత్రబంధకవిత్వలక్షణములు లక్ష్యములతో ఛత్రబంధాంతర్గత శతబంధనామావళీసహితముగా నిర్ధారితమయిన చిత్రకృతి. సహస్రకంధర రామాయణకర్త 'మధురసుకవితాధురీణు వరకళాస్పదు మండపాకకులజవిదిత యశుని పార్వతీశు వినుతియొనర్తున్' అని గురుపుత్రుని కవితాపటిమను ఉపశ్లోకించినాఁడు.

మండలేముల వేంకటరామకవి

కౌండిన్యసగోత్రుఁడును, వేంకమాంబాబంగారార్యుల పుత్రుఁడును నగు నీ కవి (1810–1870) క్రియాయోగసారమను ఎనిమిదియాశ్వాసముల పద్య కావ్యమునకుఁ గర్త. రామచంద్రశతకనిర్మాతయగు కొత్ర వేంకటరామకవి యీతని మాతామహుఁడు. నుసర్ల సుబ్రహ్మణ్యుఁడీతని గురువరేణ్యుఁడు. 'సేతుశీత నగాస్తోదయశైల మధ్య సకలాంతర్వాణి కంఠీరవుఁడ'నని కవి తన యౌద్ధత్యమును జాటినాఁడు.

ఇనుగంటి చెల్లమాంబా సీతారామచంద్రుల జ్యేష్ఠసుతుఁడగు రామ రాయలు (1810–1870) క్రియాయోగసారకృతిప్రేరకుఁడు. పుణ్యజాహ్నవీ జనకమగు మాధవపదపద్మమున నెగడిన వెలమకులమున ఘనగుణు లినుగంటి వారు. వీరు పెంపాలగోత్రజులు. వీరిమదురున కేశవరాయఁడాద్యుఁడు. సీతారామ చంద్రవిభుఁడు ఇనుగంటివారికోవలో ప్రఖ్యాతుఁడు; బొబ్బిలిరాజా రాయఁడప్ప రంగారాయల (1790–1830) వియ్యంకుఁడీతఁడు; రాజా శ్వేతాచలపతిరంగ రాయల (1830–1862) మేనత్తమగఁడు; పూర్వాచార్యప్రోక్తమయిన ప్రపదన రీతి నుద్ధరించి శ్వేతాచలపతిరంగారాయల కుపదేశించిన విశిష్టాద్వైతసిద్ధాంత విజ్ఞాని; బొబ్బిలిసంస్థానము సర్వసేనాని; ముఖ్యప్రధాని. సీతారామప్రభు కుమారుఁడు రామరాయలు రాజా రాయఁడప్పరంగారాయల యల్లుఁడు. ఉంగ రాడ, కింతలి, మంతెన ఎస్టేటుదారుఁడు. రాజా రాయఁడప్పరంగారాయలకు ఇనుగంటివారి యాఁడుఁబడుచగు బుచ్చమాంబికవలనఁ గలిగిన సీతయ్యమ్మ రామరాయలభార్య.

'సకలకళావిశారదులు సత్కవు లెంతయు సంతసింపఁగా
నొకయెడ శబ్దపాటవము నొక్కయెడన్ రసగుంఫనంబు వే
ఱొకయెడ నర్థగౌరవము నుద్యదలంకృతులుండునట్లు....'

సంఘటించిన కృతియిది.

పద్మపురాణోత్తరఖండాంతర్గతమగు క్రియాయోగసారము దీనికి మూలము[1].

మండపేముల సీతారామశాస్త్రి

శ్రీ శాస్త్రిగారు రాజాగారి యాజ్ఞమేరకు బొబ్బిలివారి వంశావళిని 616 పద్యములలో నేకాశ్వాసగ్రంథముగా సమకూర్చిరి. నాఁటి బొబ్బిలి మహారాజావారు రచించిన 'History of Zamindari of Bobbili' యను నాంగ్ల గ్రంథమున కిది పద్యరూపాంధ్రీకరణము. ఇందులో మొదటి 104 పద్యములు బొబ్బిలిపూర్వచరిత్రకును, తక్కిన 512 ను నాఁటి రాజాగారి పరిపాలనమునకును సంబంధించినవి. ప్రపదన పారిజాత సంకల్ప సూర్యోదయాది కావ్యములలోని అవతారికాభాగములందలి బొబ్బిలిరాజన్యుల వంశావళీవిషయమును వివరించి విరచించినవాఁడీ కవి[2]. కవి కౌండిన్య గోత్రజుఁడు. వేంకటకోవిద సుతుఁడు. ముసర్ల సీతారామాంతర్వాణుల శిష్యుఁడు. వేంకటరామునివిస్పష్టప్రతిష్ఠాంధ్ర కవిత్వమర్యాదుఁడు. పితృపితామహ సుసంప్రదాయాగత ప్రబంధపటిమయుఁడు.

మహారాజా సర్ వేంకటశ్వేతాచలపతిరంగారావు (1862-1926) గారి యాస్థానమునందింకను కొటికెలపూఁడి వేంకటకృష్ణసోమయాజి, కొండూరి వేంకటాచార్యులయ్యవారలు, పీసపాటి వెంకటేశ్వరులు, ముసర్ల సీతారామశాస్త్రి, ముసర్ల చినసుబ్రహ్మణ్యశాస్త్రి, చిలకమర్తి వేంకటాచార్యులు మొదలగు విద్వన్మణు లనేకు లుండిరి.

కొటికెలపూఁడి వేంకటకృష్ణసోమయాజి

కొటికెలపూఁడి వేంకటకృష్ణసోమయాజులు సుప్రసిద్ధ పండితవంశము నకు చెందినవారు. బొబ్బిలిపాలకుల కాశ్రితులు; వేంకటకృష్ణమూర్తి పౌత్రులు; రామదాసపుత్రులు; రాజావారి ప్రోత్సాహముమీఁద బొబ్బిలిపట్టణమున స్థాపించిన బుధానందినీసభాకార్యదర్శి. బొబ్బిలిరాజావారి రీసధి రక్షకులు. వీ. సోమయాజులు గారు ప్రసిద్ధ జ్యోతిశ్శాస్త్రవేత్తలు. 22 విలసనములును, 1,500 శ్లోకములును గల 'హారికచంద్రికా' యను వీరి జ్యోతిషగ్రంథము సంస్కృతమున రచింపఁ

[1] R. No. 561 ప్రాచ్యలిఖిత గ్రంథాలయము కాకినాడ ప్రతి. సౌమ్యసంవత్సరము వైశాఖ బహుళ విదియ జయవారమునకరికి లేఖకుఁడు సప్పా శంకరప్ప రామారావునింగారికి దాఖలుచేసిన తాళపత్రప్రతి కిది ప్రతిరూ. బొబ్బిలి మండపేముల సీతారామశాస్త్రిగారి ప్రతి నుండి ఎత్తి వ్రాసినది.

[2] 'వంశపురుషక్రమమ్ము తత్ప్రభునిదేశమునఁ బదాస్త్రోపదేశుఁడు తనదు మండ
లేములకుల సీతారామభూమిసురుఁడు మాలుపువాసర్చి వ్రాసె సి తీరుగాఁగ'
—ప్రపదన పారిజాతము, పు. 7.

బడినది. వీరు శాస్త్రవేత్తలేకాక సంఘసంస్కరణవిషయములందును పరిశ్రమము సలుపుచుండెడివారు. శ్రుతిస్మృతుల నవలోడనముచేసి విధవావివాహము దూష్య మని నిరూపించుచు వీరు వ్రాసిన 'విధవావివాహ నిరాసకోపన్యాసము' బుధా నందినీసభాపక్షమున బొబ్బిలిపట్టణమునందలి రంగారాయముద్రాక్షరశాలలోఁ బ్రచురితము.

మహారాజా సర్ వేంకటశ్వేతాచలపతి రంగారాయబహద్దరు

బొబ్బిలిమహారాజావారు పండితపోషకులగుటయేగాక, స్వయముగా నాంధ్రాంగ్లములయందనేకగ్రంథములను రచియించినవారు. 'Advice to the Indian Artistocracy', 'History of Bobbili Zamindari' మున్నగు ఆంగ్లకృతులును, హిందూమతము, శ్రీ మహాభారత శ్రీ మద్రామా యణ విమర్శము మున్నగు నాంధ్రకృతులును వీరి ముఖ్యరచనలు. వీరు రచించిన హిందూమత*మను గ్రంథమునందు మతత్రయము, జన్మాంతర స్మృతి, భగవదారాధనము, జ్యోతిశ్శాస్త్రవిషయము, అవివేకపు నమ్మకములు, అవతారములు, వ్రతములు మున్నగు 166 విషయములు విమర్శకదృష్టితో వ్రాయఁబడినవి. ఆరాధనలు, వ్రతములు, ఆచారములు, వ్యావహారిక హిందూ మతము, పారమార్థిక హిందూమతము అని అయిదు ముఖ్యవిభాగములుగా నీ గ్రంథము విభజింపఁబడినది. అప్పటి విజయనగరము మహారాజావారి కళాశాలాధ్యక్షులగు కిళాంబి రామానుజాచార్యులుగారు దీని కవతారికను సంతరించిరి. ఈ గ్రంథము రాజాగారికోరికమేరకు ఎమ్. కృష్ణమాచార్యులుగారు 'Hindu Religion' అనుపేర ఆంగ్లమున అనువదించిరి.

ఆర్షసంస్కృతికి అపూర్వదర్పణములయిన భారతరామాయణములమీఁద బొబ్బిలిమహారాజావారు 'శ్రీ మహాభారత శ్రీ మద్రామాయణ విమర్శము' అను పేర పాశ్చాత్య సంస్కారవాసనతో నొక విమర్శకగ్రంథమును వెలువరించి యుండిరి. ఈ రచనను ప్రశంసించుచు గుమ్మలూరి సంగమేశ్వరశాస్త్రి, ముడుంబై నరసింహస్వామి, నిష్ఠల సుబ్రహ్మణ్యశాస్త్రి, మండపాక లక్ష్మీ నారాయణశాస్త్రి, నడాదూర్ అనంతాళ్వార్ మొదలగు విజయనగర పండితు లును, బొబ్బిలిపట్టణమునందలి బుధానందినీ సభాపండితులును అభిప్రాయము లిచ్చిరి.

బొబ్బిలిమహారాజావారు 1898లో ఉదకమండలములో జరిగిన లెజిస్లేటివ్ కౌన్సిల్ సమావేశములో 'మద్రాసు బెనెన్సీబిల్లు (1898)' మీఁద రఘువంశము, మనుస్మృతి మున్నగు ప్రాచీనగ్రంథములనుండి ఉదాహరణములు చూపించుచు చేసిన ఉపన్యాసము వారి పాండిత్యమునకు, చారిత్రకజ్ఞానమునకు తార్కాణము.

* వైజయంతీ ముద్రాశాల, చెన్నపురి, 1910.

వీరాంధ్రవిశ్వకళాపరిషత్తునకు ప్రథమాధ్యక్షకల్పులు (First Pro-Chancellor, 1926)[1]. బొబ్బిలిమహారాజావారు 1926 లో లక్షరూపాయలను సంస్కృతాంధ్ర భాషలలో అధ్యయన పరిశోధనల నిమిత్తము ఆంధ్రవిశ్వవిద్యాలయమునకు విరాళమిచ్చిరి. ఈ నిధిమీఁద వచ్చు రాఁబడిలో మూఁడింట రెండుభాగములు తెలుఁగునకు, మిగిలిన యొకవంతు సంస్కృతమునకు వెచ్చపెట్టునట్లుగా సెనేటువారు తీర్మానించిరి. తెలుఁగుపాలికి వచ్చిన వంతును ఆంధ్రభాషాసాహిత్య చరిత్రముల సంకలనమునకు, ప్రచురణమునకు వినియోగింప నిశ్చయించిరి. సంస్కృతములో ఉత్తమ పరిశోధకుల నాహ్వానించి పండితవృత్తి నిచ్చుటకు నిర్ణయించిరి. 1932-33 తరువాత అరుదైన పుస్తకములను ప్రచురించు నిమిత్తము ఈ నిధిమీఁది రాఁబడి ఉపయోగింపఁబడవలయునను నిర్ణయము జరిగినది[2].

వీరి తరువాతి పాలకులయిన జమీందారులు ముఖ్యముగా రాజా రావు సర్ వేంకట శ్వేతాచలపతిరామకృష్ణరంగారావుగారును విద్యాపోషణవిషయమున పూర్వ రాజన్యులకుఁ దీసిపోనివారు. తిరుపతివేంకటకవులు, పిసుపాటి చిదంబర శాస్త్రి మున్నగు శతావధానులు వీరి సమ్మానముల నందిరి. చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారు తాము రచించిన బొబ్బిలిపట్టాభిషేకగ్రంథమును బొబ్బిలిరాజాగారి కంకిత మిచ్చిరి. ఇది నాలుగాశ్వాసముల కావ్యము. ఈ కావ్యమును కృతినిచ్చుచు వేంకటశాస్త్రిగారు చెప్పిన పద్యములు వారి గడుసుదనమునకు నిదర్శనములు.

'పెద్దతనంబునం గనిన బిడ్డ, సుధామధురానులాప మే
విద్దెయు గాని నేర్చిన వివేకిని పుట్టిన మెట్టినిండ్లకున్
దద్దయుఁ గీర్తిఁ దేఁదగినదస్యఁ గవిత్వపుఁగన్య నిచ్చితిన్
దిద్దును దిద్దగాఁబడదు దీనిస్వభావ మెఱుంగఁజెప్పితిన్'

బొబ్బిలిపట్టాభిషేకవర్ణన మిందలి ఇతివృత్తము.

బొబ్బిలిపాలకుల విద్యాపోషణము

రాజా సర్ శ్వేతాచలపతిరామకృష్ణరంగారావు బహద్దరుగారు జస్టిసుపార్టీ పక్షమున మద్రాసు ముఖ్యమంత్రిగా నుండిరి. 1931-36 మధ్య ఆంధ్రవిశ్వ విద్యాలయమునకు ప్రో-ఛాన్సలర్‌గా వ్యవహరించిరి. 1937 లో ఆంధ్రవిశ్వ విద్యాలయమువారి డాక్టరేట్ గౌరవబిరుదమును పొందిరి. రాజమండ్రి ఆంధ్రేతిహాస పరిశోధకమండలి యావజ్జీవసభ్యులు.

చెన్నపురి సివిలుసర్వీసు ఉద్యోగియగు గెలెటీదొర ఆంగ్లమున కూర్చిన వ్యావహారికాంధ్రభాషానిఘంటువు ఆనాఁటి చెన్నపురిరాష్ట్ర ముఖ్యమంత్రియును,

[1] Andhra University Silver Jubilee Souvenir, 1926-1951.

[2] Andhra University Annual Register, 1937–38, p. 147.

ఆంధ్రవిశ్వవిద్యాలయము ప్రో-ఛాన్సలరును నగు బొబ్బిలిరాజా రామకృష్ణ రంగారావున కంకితము[1].

బొబ్బిలిమహారాజావారి గ్రంథాలయమునందలి అలంకార ఆగమ ఇతిహాస జ్యోతిష ధర్మ పురాణ మంత్ర శ్రౌత శాఖలకు సంబంధించిన తాళపత్ర గ్రంథములు సుమారు 200 ఆంధ్రవిశ్వకళాపరిషద్గ్రంథాలయమునకు బహూకరింపఁబడినవి. పజ్జల చినసీతారామస్వామిశాస్త్రిగారి వైయాకరణపారిజాతము చెన్నపురీరాష్ట్ర సింహాసనాధ్యక్షసచివాగ్రగణ్యుఁడయిన బొబ్బిలిమహారాజావారి కంకితము. విశాఖపట్టణమునందలి పరవస్తువారి ఆర్షవిద్యాపాఠశాలకు బొబ్బిలి పాలకులు ప్రధాన పోషకులుగా నుండిరి. బొబ్బిలిరాజావారిపేర ఇటీవల నొక కళాశాల బొబ్బిలిలో స్థాపితమయినది.

బొబ్బిలిపాలకులు సంగీతమునుగూడ నభిమానించి ఆదరించిరి. నంది గానము వెంకయ్యగారు బొబ్బిలిసంస్థాన సంగీతవిద్వాంసులు. తుమురాడ సంగమేశ్వరశాస్త్రిగారు వెంకయ్యగారి శిష్యుఁడు; ద్వారంవారు తుమురాడ వారి శిష్యులు. వీణావాదనతత్త్వజ్ఞులగు వాసా దాసన్న, వాసా సాంబయ్య, వాసా కామయ్య మొదలగువారు బొబ్బిలిసంస్థానము నలంకరించి పేర్గాంచిన వైణికసార్వభౌములు. వైణికకులమున వాసావారి సంప్రదాయము సుప్రసిద్ధము. వాసావారి వంశీయులు దరువులు, స్వరజతులు మొదలైనవానిని రచించిరని తెలియుచున్నది.

బొబ్బిలిజమీందారులు ఆయుర్వేద వైద్యవిధానము నభిమానించి పోషించిరి[2].

[1] Galletti's Telugu Dictionary, Oxford University Press, London, 1935.

[2] ఆంధ్రపత్రిక, సంవత్సరాది సంచిక, వృష, 1941, పు. 154.

ఉపజీవ్య గ్రంథసూచి

1. విశాఖపట్టణముజిల్లా వృత్తాంతసంగ్రహము, పుటలు 525—529.
2. మండలేముల సీతారామశాస్త్రి, బొబ్బిలివారి వంశావళి, 1914.
3. చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి, బొబ్బిలిపట్టాభిషేకము, వావిళ్ళ, చెన్నపురి, 1932.
4. అడిదము రామారావు, విస్మృతకళింగాంధ్రకవులు.
5. బుర్రా శేషగిరిరావు, బొబ్బిలియుద్ధము, వేదవ్యాస ప్రెస్, విజయనగరము, 1942.
6. తిరుపతివేంకటకవులు, నానారాజసందర్శనము, పుటలు 247—250, 289—293.
7. మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి, ఆంధ్రరచయితలు.
8. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి, ఆంధ్రాభ్యుదయము, పుటలు 147—150.
9. కవికొండల వేంకటసత్యనారాయణమూర్తి, విజయరామగజపతి.
10. కవికొండల వేంకటసత్యనారాయణమూర్తి, విశాఖమండల చరిత్రము.

11. తెలుగువిజ్ఞానసర్వస్వము, సంపుటము 3. పుటలు 1171-1175.
12. ఆంధ్రవిజ్ఞానము, సంపుటము 2.
13. రాయడప్పరంగారావు, సంకల్పసూర్యోదయము, శ్రీ రంగారావు ముద్రాశాల, బొబ్బిలి, 1906.
14. జనార్దనరంగారావు, మిత్రవిందాపరిణయము, శ్రీరామవిలాస గ్రంథమాల, చిత్రాడ.
15. కొటికెలపూడి కోదండరామకవి, ప్రపదన పారిజాతము, శారదాంబావిలాస ముద్రాక్షరశాల, చెన్నపురి, 1906.
16. Robert Orme, A History of the Military Transactions of the British Nation in Indostan, Vol. II, pp. 253-260.
17. Report of the Estates Land Act Committee, Part II, pp. 15-20.
18. A. Vadivelu, The Aristocracy of Southern India, Vol. I, pp. 33-62.
19. V. L. Sastry, Encyclopaedia of the Madras Presidency and the Adjacent States, pp. 417-421.
20. Rangarao Bahadur, Maharajah of Bobbili, Account of the Bobbili Zamindari, Second Edition, Madras, 1907.
21. M.A.M.P. Vol. I, p. 60.
22. Bobbili Raja, Hindu Religion, Rendered into English by M. Krishnamachariar, Addison Press, Madras, 1918.
23. Andhra University Annual Register, 1937-1938.
24. The Madras Court of Wards Manual, Madras, 1907.
25. W. W. Hunter, Imperial Gazetteer of India, Vol. III, p. 21 ; Vol. VIII, pp. 252, 253.
26. Gustav Oppert, Lists of Sanskrit Manuscripts in Private Libraries of Southern India, Vol. I, Madras, 1880 ; Vol. II, Madras, 1885.
27. A. Vadivelu, The Ruling Chiefs, Nobles and Zamindars of India, Vol. I, Madras, 1915, pp. 508-511.